

పట్టేద్దామా ప్రోత్సాహకం!
బడుగు, బలహీన వర్గాల అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో రాణించేలా ప్రభుత్వం బృహత్తర పథకం అమలులోకి తెచ్చింది.

8లో



టమాట కిలో రూ.18
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/ 18.7°

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు 'స్పందన' ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవరెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

రేపు 'యూనిటీ ఆఫ్ రన్'



పుట్టపర్తి టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం 'యూనిటీ ఆఫ్ రన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశాన్ని సమైక్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ నిర్వహించే 'యూనిటీ ఆఫ్ రన్' కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పుట్టపర్తిలోని ఉజ్వల ఫౌండేషన్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ నుంచి పోలీస్ కార్యాలయం వరకూ పరుగు సాగుతుదన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, యువకులు, కళాశాల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంతల ఆదాయం రూ.4.04 లక్షలు

అనంతపురం: వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.04 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు.

తుంగభద్రలో తగ్గిన నీరు



బొమ్మనహాళ్: టీబీ డ్యాంలో నీరు తగ్గింది. ఆదివారం నాటికి 34.534 టీఎంసీలకు నీటి నిల్వ పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.427 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 0, అవుట్‌ఫ్లో 8,909 క్యూసెక్కులుగా నమోదైంది.

సాంబారులో పడిన చిన్నారి మృతి




మెర్సీ (ఫైల్)

కనగానపల్లి: వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు సాంబారులో పడి గాయపడిన మూడేళ్ల చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూసింది. వివరాలు.. తగరకుంట గ్రామానికి చెందిన తప్పెట వెంకటేసులు, గౌతమి దంపతుల కుమార్తె మెర్సీ (3) ఓ విందు కార్యక్రమంలో వంటశాల వద్దకెళ్లి ప్రమాదవశాత్తు వేడి సాంబారు పాత్రలో పడింది. కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారిని వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం చిన్నారి కన్నుమూసింది.

బతుకులతో బంతాట!

- జోరుగా క్రికెట్ బెట్టింగ్
- డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు
- మొబైల్ యాప్ ద్వారా నిర్వహణ
- కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసులు



- పుట్టపర్తి శ్రీ సత్యసాయి సూపర్ హాస్పిటల్ జంక్షన్‌లోని ఓ లాడ్జిలో నలుగురు రూము అద్దెకు తీసుకున్నారు. శని, ఆదివారాల్లో బంతి బంతికీ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ల్యాప్‌టాప్ ద్వారా మ్యాచ్ వీక్షిస్తూ ఎవరికీ అర్థం కాని రీతిలో బెట్టింగ్ కాస్తున్నారు. ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం జరిగిన ఆస్ట్రేలియా - న్యూజిలాండ్ మ్యాచ్ సందర్భంగా సుమారు 50 సార్లు బెట్టింగ్ కాసినట్లు సమాచారం. ఒక్క రోజులో దాదాపు రూ.50 లక్షలు చేతులు మారిందని తెలిసింది.

- ధర్మవరంలోని శాంతినగర్, సిద్దయ్య గుట్ట, యాదవ వీధిలో ఎక్కువగా బెట్టింగ్ జరుగుతోందని తెలిసింది. పక్కా సమాచారంతో పోలీసులు రెండు మూడుసార్లు దాడులు కూడా నిర్వహించారు. పోలీసుల రాకను పసిగట్టిన బెట్టింగ్ రాయుళ్లు జాగ్రత్తపడ్డారు. అక్కడి నుంచి నిర్వాహకులు మకాం మార్చి యథావిధిగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు.

- హిందూపురంలోని బస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జిలో 10 రోజులుగా ముగ్గురు వ్యక్తులు ఓ రూములో అద్దెకు ఉంటున్నారు. వరల్డ్‌కప్ పాయింట్ల పట్టిక ఆధారంగా రన్ రేటు, ఆలౌట్, ఇన్నింగ్స్ వికెట్లు, సెంచరీలు, బౌండరీలపై మాత్రమే బెట్టింగ్ కాస్తున్నారు. మ్యాచ్ ముగిశాక పక్కనే ఉన్న బార్‌కు వెళ్లి మద్యం తాగిన మత్తులో ఫోన్‌లో చర్చించుకోవడంతో ఈ విషయం బయటకు తెలిసింది.

సాక్షి, పుట్టపర్తి

క్రికెట్ పందేలరాయుళ్ల తీరు మారడం లేదు. బంతిబంతికీ బేరమాడుతున్నారు. డిజిటల్ పద్ధతిలో



లావాదేవీలు చేస్తున్నారు. సరికొత్త పద్ధతిలో దందా సాగిస్తున్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ మాయలో పడి పెడదోవ పడుతున్నారు. నిమిషాల్లో డబ్బు సంపాదించాలనే ఆశతో వక్రమార్గంలో నడుస్తూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. క్రికెట్ పందేలు పట్టణాల నుంచి పల్లెలకు కూడా పాకాయి. బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుంటున్న గ్రామీణ యువత ఆర్థికంగా నష్టపోయి, కుటుంబ కలహాలు చెలరేగి చివరికి తనువు చాలించే పరిస్థితుల వరకు దారి తీస్తున్నాయి.

అంతా ఫోన్‌పే ద్వారా..
క్రికెట్ బెట్టింగ్‌లో విభిన్నరకాల కోణాలు వెలుగు చూస్తున్నాయి. మొదటి పవర్ ప్లేలో ఎన్ని వికెట్లు, ఎంత స్కోరు వస్తుందనే దానిపై బెట్ కాస్తున్నారు. కెప్టెన్ వికెట్ ఎవరు తీస్తారనే దానిపై కూడా పందేలు ఆడుతున్నారు. ఒక మ్యాచ్‌కు సంబంధించి సుమారు వంద రకాలు పైగా బెట్టింగ్‌లు వేస్తున్నట్లు తెలిసింది. ఇన్నింగ్ స్కోర్‌పై.. ఆటగాళ్ల వ్యక్తిగత స్కోర్‌పై.. ఆలౌట్ కావడంపై.. బౌలర్ల ఎకానమీపై.. ఇలా రకరకాలుగా పందేలు కాస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో చోట ఉండి వాట్సాప్ కాల్స్ ద్వారా మాట్లాడుతూ.. ప్రతి బంతికీ బెట్టింగ్ కాస్తూ.. ఫోన్ పే ద్వారా ఎప్పటికప్పుడు చెల్లింపులు పూర్తి చేసుకుంటున్నట్లు సమాచారం.

లాడ్జీల్లో మకాం వేసి..
హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి పట్టణాల్లో హోటళ్లు, లాడ్జీల్లో నిర్వాహకులు మకాం వేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారాంతపు సెలవుల్లో జరిగే మ్యాచ్‌లపై రూపాయికి ఒకటికి మూడు, నాలుగు రెట్లు ఆఫర్లు ప్రకటిస్తూ పందేలు నిర్వహిస్తున్నారు. స్పిన్ బౌలింగ్‌కే ఎక్కువ వికెట్లు పడుతాయని.. రన్ రేటు ఆరు కంటే తక్కువ ఉంటుందని ముందుగానే రేట్లు ప్రకటిస్తారు. ఆసక్తి ఉన్న వారు ముందుగానే డిపాజిట్ చేయించుకుంటున్నారు. పట్టణాల నుంచి వాట్సాప్ కాల్స్ ద్వారా మాట్లాడుతూ పల్లె యువతనూ చెడగొడుతున్నారు. బెట్టింగ్‌రాయుళ్లపై సమాచారమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



యువత బెట్టింగ్‌ల బారిన పడొద్దు. క్రికెట్ పందేలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. బెట్టింగులకు పాల్పడే వారి బెండు తీస్తాం. క్రికెట్ మ్యాచ్ చూడటం తప్పు కాదు. పందెం కాయడం నేరం. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

– ఎస్‌పీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు సంగాల విద్యార్థిని



ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉమాదేవి (ఫైల్)

బత్తలపల్లి: ఆంధ్రప్రదేశ్ యువ రెజ్లర్ ఉమాదేవి అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. నవంబర్ 17న రష్యాలోని మాస్కోలో జరిగే ఈ మెగా టోర్నీలో జూనియర్ కేటగిరిలో 49 కిలోల విభాగం నుంచి ఆమె తలపడనుంది. బత్తలపల్లి మండలం సంగాల గ్రామానికి చెందిన దేవరకొండ నారాయణస్వామి, సరస్వతి దంపతుల కుమార్తె ఉమాదేవి తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో ఏడాది చదువుతోంది. తండ్రి నారాయణస్వామి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంతర్జాతీయ పోటీలకు వెళ్లి వచ్చేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారు. దాతలు, క్రీడాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేస్తే దేశానికి మంచి పేరు తీసుకువస్తానని ఆమె ధీమా వ్యక్తం చేస్తోంది. ఎవరైనా దాతలు స్పందిస్తే ఫోన్‌పే (7981894274, డి.నారాయణస్వామి)కు లేదా ధర్మవరంలోని ఎస్‌బీఐ ఖాతా నంబర్ 32695973301 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0000250)కు నగదు బదిలీ చేసి సాయం చేయాలని ఆమె కోరుతోంది.

నా మాటలు వక్రీకరిస్తున్నారు

- రాజకీయ సమాధి అవుతారని చెప్పా
- జగన్ మళ్లీ సీఎం కావడం చంద్రబాబు చూడాలి
- టీడీపీ నేతల తీరును తప్పు పట్టిన ఎంపీ మాధవ్



మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికీ కృషి చేశారని, వారంతా మరోమారు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడతారని, ఎన్నికల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ రాజకీయంగా సమాధి అవడం తథ్యమని సామాజిక సాధికార బస్సుయాత్రలో వ్యాఖ్యానించానని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పునరుద్ఘాటించారు. అయితే టీడీపీ నాయకులు తన మాటలను వక్రీకరించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ మాధవ్ విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు గురించి ఉచ్చారణ దోషంతో మాట్లాడితే దానిని పట్టుకుని టీడీపీ నానా యాగీ చేస్తోందన్నారు. నూరు గొడ్లను తిన్న రాబందు చిన్న గాలివానకు రాజమండ్రి సెంట్రల్ జైలులో పడిందని చంద్రబాబును ఉద్దేశించి ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనమనే తుపానుకు టీడీపీ, ఆ పార్టీ అధినేత ఏ విధంగా కొట్టుకుపోతారోనన్నారు. రాష్ట్రంలో నలుగురు బీసీలకు రాజ్యసభ సీట్లు కేటాయించి సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, ఎమ్మెల్యే, మంత్రి పదవుల్లో 60 నుంచి 70 శాతం బీసీలకు కేటాయించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. 139 బీసీ కులాలను ఒకే తాటిపైకి తెచ్చి అందులో వివిధ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న మేలును బీసీలు మరువరని, ఇదే విషయమై తాను సమావేశంలో మాట్లాడినట్లు తెలిపారు.

చంద్రబాబుకు పటిష్ట భద్రత
టీడీపీ అధినేత చంద్రబాబుకు జైలులో పటిష్ట భద్రతను ప్రభుత్వం కల్పించిందని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చంద్రబాబు చూడాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్రా వెంకటేశ్, నసనకోట ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్ని భయాందోళనకు గురిచేయొద్దు


బత్తలపల్లి: చిరుత సంచరిస్తోందంటూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌ఓ ఉసేనప్ప, ఎఫ్‌డీఓ అక్కులప్ప హెచ్చరించారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. కొందరు విద్యార్థులు నెట్‌లో నుంచి చిరుత ఫొటో డౌన్‌లోడ్ చేసినట్లు వివరించడంపై మండిపడ్డారు. కియా పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులు పలువురు తాము బైకులో వెళుతుండగా చిరుతను చూసినట్లు చెప్పారు. అది తమను కొంత దూరం వెంబడించినట్లు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రత్యక్షంగా చూసినట్లయితేనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనవసరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, తప్పుడు ప్రచారం చేయడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, సంగాల, ఓబుళాపురం పంచాయతీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిరుతల సంచారం ఎక్కడా లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు.



ఓబుళాపురం గ్రామస్తులతో సమావేశమైన ఫారెస్టు అధికారులు

'రత్నగిరి'లో గుప్త నిధుల వేట

రొళ్ల: మండలంలోని చరిత్రాత్మక రత్నగిరి దుర్గంపై గుప్త నిధుల వేట కొనసాగుతోంది. పురాతన గవి మఠం సమీపంలో ఇటీవల గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం పెద్దపెద్ద బండరాళ్లను పెకిలించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అటుగా వెళ్లిన కొందరు పర్యాటకులు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ప్రతి అమావాస్య, పౌర్ణమికి రెండు రోజులు ముందు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో శనివారం పౌర్ణమి కావడంతో అంతకంటే రెండు రోజుల ముందు గవి మఠం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ విషయం తెలిసినా అధికారులు స్పందించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రత్నగిరి దుర్గంపై నిఘా పెంచి గుప్తనిధుల వేటగాళ్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన పురాతన గవి మఠం ప్రాంతం

మూడింట మహిళలే అధికం



నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
మడకశిర	1,06,948	1,04,534	00	2,11,482
హిందూపురం	1,20,724	1,18,369	20	2,39,113
పెనుకొండ	1,15,159	1,13,157	03	2,28,319
పుట్టపర్తి	1,01,360	1,02,101	13	2,03,474
ధర్మవరం	1,17,050	1,17,997	20	2,35,067
కదిరి	1,23,998	1,25,652	05	2,49,655
మొత్తం	6,85,239	6,81,810	61	13,67,110

- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- జిల్లాలో 23 వేల మంది కొత్త ఓటర్లు
- అభ్యంతరాలకు డిసెంబర్ 9 వరకూ గడువు
- 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల

పుట్టపర్తి అర్బన్: మహిళలు పురుషులకు ఏ మాత్రం తీసిపోవడం లేదు. అన్నింటా తమ సత్తా చాటుతూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల్లోనూ నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతున్నారు. శుక్రవారం విడుదల చేసిన జిల్లా ఓటరు ముసాయిదా జాబితా పరిశీలిస్తే నేతల తలరాతలు మార్చడంలో పురుషులకు సమానంగా మహిళలూ తమవంతు పాత్ర పోషించనున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అయితే మహిళా ఎక్కువగా ఉన్నారు. పుట్టపర్తి నియోజక వర్గంలో 741 మంది, ధర్మవరం నియోజక వర్గంలో 947 మంది, కదిరి నియోజక వర్గంలో 1,654 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

పెరిగిన ఓటర్లు 23,796..
ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలిస్తే జిల్లాలో 23,796 మంది ఓటర్లు పెరిగారు. గతంలో 13,43,312 మంది ఓటర్లుగా ఉండగా, ప్రస్తుతం 13,67,110 మంది ఉన్నారు. జిల్లాలో అతి తక్కువగా 2,03,474 మంది ఓటర్లు పుట్టపర్తి నియోజక వర్గంలో ఉండగా, అత్యధికంగా కదిరి నియోజక వర్గంలో 2,49,655 మంది ఉన్నారు.

డిసెంబర్ 9వ తేదీ వరకూ గడువు..
ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 13,67,110 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో మహిళలు 6,81,810 మంది ఉండగా, పురుష ఓటర్లు 6,85,239 మంది, ఇతరులు 61 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు 3,429 మంది అధికంగా ఉన్నారు. కానీ మూడు నియోజకవర్గాల్లో మాత్రం మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేసేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకూ గడువు ఇచ్చారు.

అభ్యంతరాల పరిశీలనకు ప్రత్యేక క్యాంపెయిన్..
అభ్యంతరాలు తెలియజేసేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టి సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 4, 5 తేదీలు, డిసెంబర్ 2, 3 తేదీల్లో బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు అందుబాటులో ఉంటారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నారు. అభ్యంతరాలు, క్లెయింలను డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కరించి 2024 జనవరి 1వ తేదీ నాటికి పూర్తి ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తారు. 2024 జనవరి 5వ తేదీన నూతన ఓటరు జాబితా విడుదలవుతుంది. ఈ జాబితాతోనే వచ్చే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు..
జిల్లాలో ఇప్పటిదాకా 1,555 పోలింగ్ కేంద్రాలుండగా, రేషనలైజేషన్ అనంతరం ఆ సంఖ్య 1,561కి చేరింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 1,500 మంది కంటే ఎక్కువ ఓటర్లున్నా, పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్లు కంటే దూరం ఉన్నా, పోలింగ్ కేంద్రం శిథిలావస్థలో ఉన్నా...దాన్ని మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో కొత్తగా 6 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. ఇక పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జిల్లా ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితా ప్రతులు కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. వాటన్నింటినీ పోలింగ్ కేంద్రాల వారీగా పంపనున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా వాటిని సిద్ధం చేసి ఉంచారు.

అభ్యంతరాలుంటే తెలపండి



ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, క్లెయింలు తెలియజేస్తే పరిశీలించి పరిష్కరిస్తాం. ఇందుకు 43 రోజుల వ్యవధి ఉంది. డిసెంబర్ 9వ తేదీ వరకూ పోలింగ్ కేంద్రాల వారీగా అభ్యంతరాలు స్వీకరిస్తాం. నూతన ఓటరుగా నమోదుకు కూడా ఇంకా అవకాశం ఉంది.

– అరుణ్‌బాబు, కలెక్టర్

చింతలరాయ గోవిందా...గోవింద

తాడిపత్రి అర్బన్: చింతలరాయ గోవిందా.. గోవింద నామ స్మరణతో తాడిపత్రి ప్రాంతం ప్రతిధ్వనించింది. చింతల వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చింతల వేంకటరమణస్వామికి ప్రత్యేక పూజలు, చండీహోమం, రుద్రహోమం చేశారు. 9 గంటలకు రథశాల వద్ద రథాంగ పూజ, బలిహరణ, సాత్విక బలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు. సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథయాత్ర ప్రారంభమైంది. వివిధ రకాల నృత్య ప్రదర్శనల మధ్య భక్తులు రథాన్ని లాగారు. మెయిన్‌బజార్ గుండా బయలుదేరి హనుమాన్ జంక్షన్ వరకు రథం సాగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు రథశాలకు చేరుకుంది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ సీఎం గంగయ్య ఆధ్వర్యంలో సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎస్‌ఐలు మహ్మద్‌గౌస్, శ్రీనివాసులు, శరత్‌చంద్ర, గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.



రథోత్సవానికి హాజరైన భక్తజనం, (ఇన్‌సెట్) పల్లకీలో ఊరేగింపుగా వస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత చింతల రాయుడు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వివాహిత మృతి


మృతురాలు సవిత

అమరాపురం: విద్యుత్ షాక్‌తో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.... అమరాపురం మండలం కాచికుంట గ్రామానికి చెందిన శివన్న భార్య సవిత (42) నివాసముంటున్న ఇంటిపై భాగంలో ఇనుప రేకులు ఉన్నాయి. గాలులకు అటుగా ఉన్న విద్యుత్ తీగ కోతకు గురి కావడంతో ఇనుప రేకులకు ఆదివారం ఉదయం విద్యుత్ ప్రసారం జరుగుతోంది. ఈ విషయం తెలియని సవిత.. స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లినప్పుడు ఇనుప కడ్డీను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలింది. విషయాన్ని గమనించిన భర్త శివన్న, కుటుంబసభ్యులు వెంటనే అమరాపురంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. శివన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తాడిపత్రి: రెండు రోజుల క్రితం గొంతు కోసుకున్న వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రెండు రోజుల క్రితం గొంతుకు తీవ్రమైన గాయంతో బాధపడుతున్న తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌లో లింగుట్ల లక్ష్మీదేవి (60)ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. మాట్లాడలేని స్థితిలో బాధితురాలికి ప్రథమ చికిత్స అందజేసి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆమె మృతి చెందింది. అయితే ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ హమీద్ ఖాన్ తెలిపారు. అయినా మృతురాలు తానే గొంతుకోసుకుందా, లేక ఇతరులు ఎవరైనా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు వివరించారు.

వివాహిత కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

యాడికి: వివాహితను కిడ్నాప్ చేసిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపిన మేరకు... యాడికి మండలం పిన్నేపల్లె గ్రామానికి చెందిన ఓ వివాహితను మాయమాటలతో లోబర్చుకున్న అదే గ్రామానికి చెందిన సతీష్... ఈ నెల 26న ఆమెను తన వెంట పిలుచుకెళ్లాడు. ఇదే విషయంపై వివాహిత భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు తిరుపతిలో ఉన్న ఆమె ఆచూకీని పసిగట్టి పిలుచుకొచ్చారు. విచారణ అనంతరం వివాహిత ఫిర్యాదు మేరకు సతీష్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం వేములపాడు క్రాస్‌లో సంచరిస్తున్న సతీష్‌ను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నిబంధనలు తుంగలోకి.. ప్రాణాలు గాల్లోకి!

మీరు చూస్తున్న ఈ చిత్రం నాలుగు రోజుల క్రితం కర్ణాటకలోని చిక్కబళ్లాపురం వద్ద చోటు చేసుకున్న ప్రమాదానికి సంబంధించింది. పిల్లాపాపలతో కలసి ప్రైవేట్ వాహనంలో బెంగళూరుకు బయలుదేరిన వారందరూ ఆ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. వైట్ బోర్డు వాహనంలో ప్రయాణించిన కారణంగా ఆయా మృతుల కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం అందకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా వైట్ బోర్డు వాహనాలను ట్యాక్సీలుగా మార్చి తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో నిర్వాహకులు చెలగాటమాడుతున్నారు.



- విచ్చలవిడిగా ప్రైవేటు వాహనాలు
- ప్రయాణికులకు వైట్‌బోర్డు వాహనాల గాలం
- ప్రైవేటు మొబైల్ యాప్ ద్వారా రాకపోకలు
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే వర్తించని బీమా

సాక్షి, పుట్టపర్తి: నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేట్ వాహనాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ప్రైవేటు మొబైల్ యాప్‌ల ద్వారా ప్రయాణికులకు గాలం వేసి వైట్ బోర్డు వాహనాలు గమ్యస్థానాలకు నిర్వాహకులు చేరవేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతే బీమా పరిహారం వర్తించకుండా పోతోంది. కేవలం ప్రభుత్వం ప్రకటించే పరిహారంపైనే మృతుల కుటుంబాలు ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోని ధర్మవరం, పెనుకొండ, గోరంట్ల, పుట్టపర్తి, కదిరి, హిందూపురం నుంచి రోజూ వందకు పైగా వైట్ బోర్డు వాహనాలు ప్రయాణికులను పొరుగున ఉన్న కర్ణాటకకు చేరవేస్తున్నాయి.

ప్రైవేటు మొబైల్ యాప్ ద్వారా

సొంత పనులపై బెంగళూరు వెళ్తున్న వారు తమ వాహనాల్లో ఇతరులను పెయిడ్ ప్రాసెస్ విధానం కింద పిలుచుకెళుతున్నారు. ఇందు కోసం ప్రైవేట్ మొబైల్ యాప్ (బ్లా బ్లా)ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు ప్రైవేట్ వాహనదారులు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వైట్ బోర్డు వాహనం కావడంతో రవాణా శాఖాధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆపి ప్రశ్నిస్తే 'కలిసి వెళ్తున్నాం.. బాడుగకు కాదు.. మేమంతా స్నేహితులం' అని ముందుగానే ప్రయాణికులతో చెప్పిస్తున్నారు. ఫలితంగా రోజూ వేల సంఖ్యలో జిల్లా వాసులు వైట్ బోర్డు వాహనాల్లో పొరుగున ఉన్న కర్ణాటకకు ప్రయాణిస్తున్నారు. ఎల్లో బోర్డు వాహనమైతే పన్ను చెల్లించాల్సి వస్తుందని చాలా మంది వైట్ బోర్డు వాహనాలనే ఏర్పాటు చేసుకుని అక్రమ దందాకు తెరలేపారు.

త్వరగా చేరుకోవచ్చనే ఆత్రుత

ఆర్టీసీ బస్సులతో పోల్చుకుంటే ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అయితే బస్సు కంటే త్వరగా గమ్యస్థానం చేరుకోవచ్చనే ఉద్దేశంతో మొబైల్ యాప్ ద్వారా చాలామంది ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాక రూ.వందనో, రూ.200 అదనంగా చెల్లిస్తే ఇంటి వరకూ చేరుస్తుండడం కూడా ఇందుకు ప్రధాన కారణమవుతోంది. బస్సులో వెళ్తే బస్టాండులో దిగి తర్వాత లగేజీతో ఆటో, క్యాబ్‌ల్లో ప్రయాణించడం అదనపు భారమవుతుండడంతో చాలా మంది జిల్లా వాసులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే

వైట్ బోర్డు వాహనాలైతే రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటి నుంచి 15 ఏళ్ల వరకూ ఎలాంటి పన్ను లేకుండా రోడ్డుపై తిరగవచ్చు. అదే ఎల్లో బోర్డు (ట్యాక్సీ) వాహనాలైతే ప్రతి రెండేళ్లకు ఓ సారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. పైగా ప్రయాణికులను చేరవేసేందుకు ఎల్లో బోర్డు వాహనాలకు మాత్రమే అనుమతులు ఉంటాయి. వైట్‌బోర్డు వాహనాలు కేవలం వాహనదారుడు మాత్రమే తన అవసరాలకు వినియోగించుకోవాలనే నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. అయితే కొంత కాలంగా వైట్ బోర్డు వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా ట్యాక్సీలుగా మార్చి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బెంగళూరు నుంచి ధర్మవరం, గోరంట్ల, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాలకు రోజూ ప్రయాణికులతో వందల కొద్దీ వైట్ బోర్డు వాహనాలు తిరుగాడుతున్నాయి.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం



వైట్ బోర్డు వాహనాలపై త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపడతాం. చిక్కబళ్లాపుర ఘటనతో వైట్ బోర్డు వాహనాల వల్ల జరిగే నష్టంపై ప్రయాణికులను చైతన్య పరిచేలా చర్యలు తీసుకున్నాం. ట్యాక్సీ సర్వీసుల్లో మాత్రమే ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవాలి. లేదంటే ప్రజారవాణా వాహనాలను ఆశ్రయించాలి. ఎవరూ ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులతో పట్టుబడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.

– ఎస్ఎస్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి

పట్టు పురుగులపై విషప్రయోగం


మృతి చెందిన పట్టుపురుగులు

రొద్దం: మండలంలోని ఆర్‌ఎల్ కొత్తూరులో పట్టుపురుగులపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగరాజు మల్బరీ సాగు చేపట్టారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మల్బరీ ఆకులపై క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. విషయం తెలియని నాగరాజు ఆ ఆకులను మేతగా వేయడంతో తిన్న పట్టుపురుగులు మృతి చెందాయి. ఘటనతో రూ. లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

గోడ కూలి వ్యక్తి మృతి


ఓబులేసు (ఫైల్)

కూడేరు: గోడ కూలి మీద పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన కురుబ ఓబులేసు(65) ఆదివారం సాయంత్రం తన పశువుల పాకలో ఆవును కట్టేస్తుండగా గోడ కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ఆయనను కుటుంబసభ్యులు వెలికి తీసి అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉత్కంఠగా జూడో పోటీలు


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 67వ రాష్ట్ర స్థాయి జూడో అండర్ 14, 17, 19 బాల, బాలికల పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం పోటీలను హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రారంభించి, 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ బి.ఓబిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ బాబయ్య, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ముత్యాలు, చిట్రా వెంకి, ఆది, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

పెనుకొండ: గోరంట్లకు చెందిన పాత్రికేయుడు ఈశ్వర్‌పై దాడికి పాల్పడిన కేసులో ధర్మవరానికి చెందిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. వివరాలను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ధర్మవరానికి చెందిన సింగెటి రాజు, నీలూరి రమేష్, చక్రవర్తి, కంసాల శంకరాచారి స్నేహితులు. వీరికి హత్యలు, దొంగతనాలు, పలు ఘర్షణలతో సంబంధం ఉంది. వీరి స్నేహితుడు శీన ధర్మవరానికి చెందిన శివకు రూ.లక్ష అప్పుగా ఇచ్చాడు. ఈ డబ్బు చెల్లించడంలో శివ వాయిదాలు వేస్తూ వచ్చాడు. ఒత్తిళ్లు పెరగడంతో శివ స్నేహితుడు ఐటీడీపీ నరేష్ జోక్యం చేసుకుని శీనతో మాట్లాడాడు. శివ వద్ద డబ్బు లేదని, ఉన్నప్పుడు ఇస్తాడని, అప్పటి వరకూ ఇబ్బంది పెట్టరాదని కోరాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో డబ్బు ఇచ్చేది లేదని, చేతనైనది చేసుకోమంటూ నరేష్ తిరగబడ్డాడు. దీంతో శివ డబ్బు ఇవ్వకుండా నరేష్ అడ్డుపడుతున్నట్లుగా శీన అపోహ పెంచుకున్నాడు. ఇదే విషయాన్ని నేర ప్రవృత్తి గల తన స్నేహితుల వద్ద చెప్పుకుని బాధపడ్డాడు. అయితే ఆరు నెలల క్రితం క్రికెట్ బెట్టింగ్ విషయంగా నరేష్‌కు సింగెటి రాజు, నీలూరి రమేష్, చక్రవర్తి, కంసాల శంకరాచారి మధ్య పాత గొడవలున్నాయి. ఇదే అవకాశంగా భావించిన వారు నరేష్‌పై దాడి చేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న నరేష్ సమీప బంధువు గోరంట్లకు చెందిన విలేకరి ఈశ్వర్... చక్రవర్తికి ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. దమ్ముంటే గోరంట్లకు వచ్చి తనను కొట్టాలని సవాల్ విసిరాడు. దీంతో రెచ్చిపోయిన చక్రవర్తి బృందం ఈ నెల 26న గోరంట్లకు చేరుకుని ఈశ్వర్‌పై కట్టెలతో దాడి చేసి పారిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ఈ నెల 28వ తేదీ సాయంత్రం పెనుకొండలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తచ్చాడుతున్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అయితే ఈ కేసులో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని, కేవలం వ్యక్తిగత కక్షతోనే దాడి జరిగినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసిందని డీఎస్పీ హుస్సేన్‌పీరా వెల్లడించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు సుబ్బరాయుడు, రాజారమేష్, సిబ్బందిని అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

సమగ్ర ప్రణాళికతోనే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం రూరల్: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరమని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలు అంశంపై ఆదివారం అనంతపురం శివారులోని రేడియంట్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు చేరువైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విభజన అనంతరం రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం చివరకు మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాల అభివృద్ధికి రూ.లక్ష కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్; సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాస్ట్రో కిరణ్ కుమార్, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

గార్లదిన్నె: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన రాము కుమార్తె ఐశ్వర్య (18)కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం పాపినేపాళ్యంలో బంధువుల ఇంటికి చేరుకున్న ఆమె... ఆదివారం ఉదయం కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

- కుటుంబ కలహాల నేపథ్యంలో గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లికి చెందిన వివాహిత యల్లమ్మ (37) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు చేసిన అప్పులు తీర్చడం ఆమెకు పెనుభారమైంది. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనకు లోనైన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.
- గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన లోలూరు రమేష్ (45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మతి స్థిమితం సరిగా లేని ఆయన శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వలంటీర్ బలవన్మరణం


రాజేష్ (ఫైల్)

రామగిరి: మండల కేంద్రానికి చెందిన వలంటీర్ గొల్ల రాజేష్ (29) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపిన మేరకు... కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన రాజేష్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయంగా గతంలోనూ ఆత్మహత్యాయత్నం చేశాడు. దాదాపు రూ.5 లక్షల వరకూ రాజేష్‌కు అప్పులున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య హరిత, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' కలయిక


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

- బత్తలపల్లిలో పూర్వ విద్యార్థుల సందడి
- మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు

బత్తలపల్లి: అక్కడున్న అందరి కళ్లలో చెప్పలేని ఆనందం... ఒక్కొక్కరు నడిచొస్తుంటే ఆత్మీయ పలకరింపులు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఈ ఆత్మీయ అనుబంధాలకు బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాల వేదికై ంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం 1993–94 విద్యాసంవత్సరంలో ఆ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 180 మందికి గాను 120 మంది ఆదివారం స్థానిక గుండా కల్యాణమంటపంలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడిన వారందరూ దసరా సెలవుల నేపథ్యంలో కుటుంబాలతో సహా స్వగ్రామాలకు తరలివచ్చారు. ఈ క్రమంలో ఆదివారం బత్తలపల్లిలో సమావేశమై ఆనందోత్సహాలతో రోజంతా గడిపారు. ఒకరి కష్టాల్లో మరొకరు పాలుపంచుకునేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు షణ్ముఖరెడ్డి, నాగరత్నమ్మ, రామచంద్ర, అజయ్, మల్లయ్య, కొండన్న, విశ్వరూప, పాఠశాల స్థలదాత జక్కంపూడి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం మృతి చెందిన ఇద్దరు మిత్రుల కుటుంబసభ్యులకు, భర్త మృతి చెందిన మరో స్నేహితురాలి కుటుంబానికి రూ.80 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు లక్ష్మానాయుడు, రమేష్, జనార్ధననాయుడు, చంద్రశేఖర్, శంకరయ్య, సురేంద్ర, సుబ్రహ్మణ్యం, నారాయణస్వామి, కుమ్మర నరేంద్ర, బాలనరసింహారెడ్డి, శంకరరెడ్డి, బోయపాటి సూర్యనారాయణ, కుమ్మర ఆదినారాయణ, బ్యాంకు కాశి, కొడవండ్లపల్లి రవి, కమతం సంగాలప్ప, పెద్దయ్య నేతృత్వం వహించారు.

పట్టేద్దామా ప్రోత్సాహకం!

- సివిల్స్ పరీక్షల్లో రాణించేలా ప్రభుత్వ బాసట
- బడుగు, బలహీన వర్గాల అభ్యర్థుల కోసం బృహత్తర పథకం
- ప్రిలిమినరీలో అర్హత సాధిస్తే రూ.లక్ష
- మెయిన్స్ పాసైతే రూ.50 వేల ప్రోత్సాహం

ప్రశాంతి నిలయం: సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అభ్యర్థులు యూపీఎస్సీ పరీక్షల్లో రాణించేలా 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పేరుతో బృహత్తర పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేసి వారి సాధికారితకు పాటుపడుతున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ తాజాగా ఆయా వర్గాల్లో బాగా చదివే వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే పూర్తయిన ప్రిలిమినరీ పరీక్షల్లో సత్తా చాటిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

అమలు ఇలా...

ఏటా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు రాష్ట్రం నుంచి 40 నుంచి 50 మంది వరకు ఎంపిక అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఆ సంఖ్యను మరింత పెంచేలా 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం' పథకానికి రూపకల్పన చేసింది. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధిస్తే రూ.50 వేల ప్రోత్సాహకం అందించనుంది. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాకే నగదు జమ కానుంది. ఈ ఏడాదిలో జరిగిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం ప్రకటించింది. http://jnanabhumi.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఎన్ని ప్రయత్నాల్లోనైనా ఈ ప్రోత్సాహకాన్ని పొందేందుకు అవకాశం కల్పించడం గమనార్హం.

అర్హతలు ఇలా..

- దరఖాస్తుదారు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత నివాసం ఉండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షలు మించకూడదు.
- కుటుంబంలో ఉద్యోగి ఉన్నట్లుయితే వారి ఆదాయ ధృవపత్రం ఉండాలి.
- 10 ఎకరాల మాగాణి లేదా 25 ఎకరాల మెట్ట భూమి లేదా మెట్ట, మాగాణి రెండూ కలిపి 25 ఎకరాల్లోపు ఉండాలి.

రాజకీయంగా పెద్దపీట

గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటుబ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని వదిలేసిన ప్రభుత్వాలు ఎన్నో ఉన్నాయి. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వ పథకాలతో పాటు రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులూ సామాజిక వర్గాల వారీగా దక్కాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. కులం, మతం, వర్గం తేడా లేకుండా అన్ని పార్టీల వారికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూర్చారు. ఈ క్రమంలోనే ఆయా వర్గాల్లో చదువుల్లో రాణిస్తున్న వారిని కూడా ప్రోత్సహించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టడం గమనార్హం.

సద్వినియోగం చేసుకోండి

అర్హులైన అభ్యర్థులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది ఇప్పటికే యూపీఎస్సీ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

–శివరంగ ప్రసాద్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి